క్లుప్తంగా

స్కూటీని ఢీకొట్టిన కారు

వేటపాలెం: కారు స్కూటీని ఢీకొట్టిన ఘటనలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల దగ్గరలో ఘటన చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ వెంటేశ్వర్లు వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొణిజేటినగర్‌కి చెందిన అంగడి ప్రసన్నకుమారి ఆమె కుమారుడిని స్కూటీపై తీసుకొని చీరాల వైపు వస్తోంది. అదే సమయంలో అమరావతి నుంచి స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో పోటీ పరీక్షలు రాయడానికి కారులో వస్తున్నారు. బైపాస్ నుంచి కళాశాలకు వెళ్లే మలుపులో కారు స్కూటీని ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న మహిళ రోడ్డుపై పడటంతో కాలు విరిగి తీవ్ర గ్రాయాలపాలయింది. వెనక వైపు కూర్చున్న కుమారిడికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మహిళను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తున్న సిబ్బంది

చినగంజాం: పర్చూరులో జెడ్పీటీసీ ఎన్నికల నిమిత్తం మండలానికి కేటాయించిన ఈవీఎంలను మంగళవారం బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చారు. మొత్తం 100 ఈవీఎంలను ఎంపీడీవో జీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచారు. కార్యక్రమంలో డీఈ శ్యాంప్రసాద్, పర్చూరు విస్తరణాధికారి టీ సుధాకర రావు, సీనియర్ సహాయకులు పీ నారాయణ రావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో యువత నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: గంజాయి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలు పట్ల యువత ఆకర్షితులు కావద్దని అవి భవిష్యత్‌ను నాశనం చేస్తాయని ఎస్సై కే సురేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయని, యువతలో ఉన్న అభివృద్ధి ఆలోచనలను మాదక ద్రవ్యాలు అణగార్చేందుకు దోహదం అవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రేణుకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



విశేషపూజలు చేస్తున్న కర్లపూడి వంశస్తులు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న చింతామణి రేణుకమ్మ తల్లి ఆలయ సప్తమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్లపూడి వంశస్తులు అమ్మవారికి పసుపుకుంకుమ, సారె, పాల పొంగళ్ల సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు అమ్మవారికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



కోటపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణులతో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జే.పంగులూరు/అద్దంకి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశం అని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కృష్ణచైతన్య పాల్గొని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తు సచివాలయ సిబ్బంది పిలిచి వెంటనే సమస్యను పరిష్కరిస్తూ గ్రామంలో కార్యక్రమం ముందుకు సాగింది. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టే ప్రతి పథకం పేదవానికి ఎంతో ఆసరాగా ఉందన్నారు. అంతే కాకుండా వారి ఆర్థిక పరిస్థితులు ఎంతో మెరుగు పడుతున్నాయన్నారు. జగనన్న తన పాలనతో ప్రజల్లో మనస్సుల్లో చెరిగిపోని ముద్ర వేశారన్నారు. మీ కుటుంబానికి న్యాయం జరిగితేనే నాకు ఓటు వేయండి లేకుంటే ఆలోచించండి అనే నాయకులు మన జగనన్న మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాస రెడ్డి, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, మాజీ సర్పంచ్, నాయకులు యర్రం గోపాల్‌రెడ్డి, ఏపీఎం జ్యోతుల ప్రసాద్, నాయకులు సుబ్బారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

20 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు పార్టీలో చేరిక..

జగనన్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అభివృద్ధికి ఆకర్షితులై పట్టణంలోని 20 నాయీబ్రాహ్మణ కుటుంబం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి మంగళవారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అద్దంకి ఆదినారాయణ, గాంధీ, గుడిపాటి శ్రీను, అద్దంకి శ్రీను, అద్దంకి హనుమంతరావు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రతిపక్ష పార్టీల నుంచి మరిన్ని వలసలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, నాయకుడు సందిరెడ్డి రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



శిడిమాను ఉత్సవంలో హాజరైన జనం

● అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

చీరాల టౌన్: భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి 54వ శిడి మహోత్సవం, తిరునాళ్లను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి గుడి వద్ద ఉండే శిడిమానుకు ఒక పెట్టెలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షణలు చేయించారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొట్టారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడిమాను బండిని లాగేందుకు పోటీ పడ్డారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలిచాయి. విద్యుత్ ప్రభలతో పాటు మ్యూజికల్ నైట్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తోటవారిపాలెం పరిసర గ్రామాల్లోని పశుపోషకులు తమ పురస్కరించుకొని పశుసంపదతో పాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకున్నారు. చీరాలతో పాటు పరిసర గ్రామాల నుంచి తిరునాళ్లను చూసేందుకు ప్రజలు వేలాదిగా హాజరయ్యారు. అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందర్భంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలతో పాటు ఏఆర్, సివిల్ పోలీసులతో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

జే.పంగులూరు: మండల పరిధిలోని బైటమంజులూరు జాతీయ రహదారి వెంబడి మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచు గరటయ్య చలివేంద్రాన్ని ప్రాంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, సర్పంచ్ చక్రవరం రుక్మిణమ్మ తిరుమలరాజు, పంచాయతీ రాజ్ ఏఈ రామ్‌కుమార్, కార్యదర్శి జానీ బేగం, ఏపిఓ లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ

బల్లికురవ: తమ కాలనీలో సైడు కాలువల నిర్మాణానికి తీర్మానం ఇవ్వనీయకుండా కులంపేరుతో దూషించారని బల్లికురవ ఎస్టీ కాలనీ నాయకుడు మల్లా మహా లక్ష్మమ్మయ్య శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో ఎస్సై వీ. వేమన గ్రామానికి చెందిన పావులూరి ఏడుకొండలు, గొట్టిపాటి కిషోర్, షేక్ బాజీ వలిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదుతో బాపట్ల డీఎస్పీ ఏవీ రమణ కాలనీలోకి వెళ్లి విచారణ చేపట్టారు. విచారణలో ఎస్సై వీ. వేమన పాల్గొన్నారు.

నేడు రేణుకాదేవి ప్రతిష్ట మహోత్సవాలు

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో చిటిపోతువారి ఇలవేల్పు రేణుకాదేవి ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు మేళ్ల చెరువు ఉదయ్‌భాస్కర్‌చే గోపూజ వేదరస్వస్తి, గణపతి పూజ, పుణ్యహావచనం, పంచగవ్యప్రాసన, దీక్షా వస్త్రా కంకణ ధారణ చండీ హోమం చేపట్టారు. బుధవారం ధాతున్యాసం, రత్న, గత్తన్యాసం మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ కమిటి తెలిపారు.

నేడు త్రిపురాంతకస్వామి వారి బ్రహ్మోత్సవాలు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 6వ తేదీ శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ధ్వజారోహణ, విఘ్నేశ్వరపూజ, అఖండస్థాపన, 4వ తేదీ గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం, 5వ తేదీ వీరభద్రస్వామి, సాయంత్రం దివ్యరథోత్సవం, 6వ తేదీ త్రిశూలస్నానం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. యాజ్ఞికులుగా నాదెండ్ల విశ్వేశ్వర గురుకుల్, రామేశ్వర్ గురుకుల్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

అద్దంకి: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో మంగళవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన హైస్కూలు సమీపంలోని గాలెయ్య పూరిల్లు ఉంది. కుటుంబ సభ్యులు పనుల కోసం పొలం వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి నుంచి మంటలు ఎగసిపడటంతో స్థానికులు గాలెయ్యకు సమాచారం అందించారు. అయితే మంటలు ఇంటికి అంటుకోవడానికి గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల అని గుర్తించారు. లోపల సిలిండర్ ఉండటంతో ఎవరూ దగ్గరలోకి వెళ్లి ఆర్పే ప్రయత్నం చేయలేక పోయారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని నాలుగు బస్తాల బియ్యం, రూ.25 వేల నగదు, పొలం దస్తావేజులు, బట్టలు, కాలిపోయాయి.

ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు



రాజేష్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

దగ్గుబాడు(కారంచేడు): గ్రామంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం మండలంలోని దగ్గుబాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చాగంటి రాజేష్‌కు ఇటీవల ఉద్యోగోన్నతి లభించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు, గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కుకుంగ్ నిర్వాహకులు, విద్యార్థులు కలసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరెడ్డి, వెలటూరి మల్లిఖార్జునరావు, శ్రీనివాసులు, బీ నిర్మల, షేక్ యూనిస్‌బాబు, బెనజీర్ బుట్టో, ఖుర్షీద్‌బేగం పాల్గొన్నారు.

3వ తేదీ కల్లా పింఛన్ పంపిణీ పూర్తిచేయాలి

చీరాల టౌన్: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నెలనెలా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ భరోసా పింఛన్‌ను లబ్ధిదారులకు 3వతేదీ కల్లా వలంటీర్లు ఇంటింటా తిరిగి పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. మంగళవారం మండలంలోని దేవాంగపురి, రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్, ఈపురుపాలెం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పింఛన్ పంపిణీని ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 11436 మంది లబ్ధిదారులకు ఫించన్లకు ప్రభుత్వం రూ.2.49 కోట్లు నగదు విడుదల చేసిందన్నారు. పంపిణీని పంచాయతీల కార్యదర్శులు పరిశీలించి మూడో తేదీలోపు పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

విద్యార్థి దశే జీవితానికి పునాది



సీఐ నుంచి ఆఫర్ లెటర్‌లు అందుకున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: విద్యార్థి దశ జీవితానికి పునాది వంటిదని అద్దంకి సీఐ రోశయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ ఆపాయింట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఏవీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ కాలేజ్ క్యాంపస్ సెలక్షన్‌లో వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన 16 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాహిల్‌బాబు, ప్రభాకర్ శ్రీనివాసులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

చీరాల అర్బన్: చీరాల మహిళా మండలిలోని ఆశా రేఖా మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగి డీపీఎం రంగారావు పాల్గొన్నారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, మందులు సక్రమంగా వాడుతూ మంచి ఆహార నియమాలను పాటించాలన్నారు. దాతల సహకారంతో 50 మందికి పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో సీబీవో సభ్యులు పద్మావతి, ప్రెసిడెంట్ నాగేంద్రమ్మ, పీడీ శ్రీనివాస్, పీఎం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే యాప్ కిందకు ఎస్‌హెచ్‌జీలు



అద్దంకి: మాట్లాడుతున్న ఏసీ



మేదరమెట్లలో మాట్లాడుతున్న రవికుమార్

అద్దంకి: స్వయం సహాయక (ఎస్‌హెచ్‌జీ) సంఘాల సమాచారాన్ని దేశ వ్యాప్తంగా ఒకే యాప్‌లో నిక్షిప్తం చేయడానికి శిక్షణ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏసీ కే రవికుమార్ అన్నారు. లోకాస్ యాప్‌పై నిర్వహించిన మొదటి రోజు శిక్షణ సమావేశానికి ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమాచారం దేశ వాప్తంగా లోకస్ యాప్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుందన్నారు. ఎలా చేయాలనే విషయమై బాపట్లలో శిక్షణ పొందిన ఏపీఎం, సీసీలు, ఇద్దరు వీవోఏలు ఈ నెల 5వ తేదీ వరకు శిక్షణ ఇస్తారని వెల్లడించారు. ప్రస్తుతం నేర్పడం కోసం డమ్మీ యాప్‌లో సమాచారం నిక్షిప్తం చేయిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తైన తరువాత ఒరిజినల్ యాప్‌లో మండల ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమాచారం పొందుపరుస్తారని చెప్పారు. సమావేశంలో ఏపీఎం కోటేశ్వరరావు, ఎల్‌సీ కేవీ భాస్కర్, టీఓటీ జీ సురేశ్, ఎన్ ఏసయ్య కే కృష్ణకుమారి, అనురాధ పాల్గొన్నారు.

వీవోఏలకు శిక్షణ..

మేదరమెట్ల: కొరిశపాడు మండలపరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథం వీవోఏలకు స్థానిక వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ కాకి రవికుమార్ యాప్ పనితీరు, పొందుపరచాల్సిన అంశాల గురించి వివరించారు. శిక్షణా కార్యక్రమం నాలుగు రోజుల పాటు ఉంటుందని, అందులో భాగంగా మూడు రోజులు శిక్షణ, నాలుగో రోజు ఫీల్డ్‌లో పర్యటిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం అనూరాధ, భాస్కర్, సాంబయ్య, మస్తాన్, చంద్రశేఖర్, భవాని, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలు పూర్తిచేయాలి

బల్లికురవ: జగనన్న కాలనీ లేఅవుట్‌లో మంజూరు చేసిన గృహాలను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చెయ్యాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. మంగళవారం మండలంలోని వైదన, నక్కబొక్కలపాడు సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు పాత మాగులూరు, సంతమాగులూరులో జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలించారు. వైదన లేఅవుట్‌లో 30 గృహాలు మంజూరుకాగా 26 గృహాలు పూర్తిచేసి 4 గృహాలు తుదిదశకు చేరటంపైఈ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు మేదా శివదుర్గా వీవోఏ రేణుక సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ప్రత్యేకంగా అభినందించారు. జగనన్న కాలని లేఅవుట్ లో మంజూరైన గృహాలు పూర్తి చేసుకుంటే మౌళిక వసతులు కల్పిస్తామని చెప్పారు. అంతకు ముందు కొమ్మినేనివారిపాలెంలో జరుగుతున్న ఉపాధిపనులు పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు.



వైదనలో గృహాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

చీరాల టౌన్: ఇంటి పట్టా, అనుమతులు పొందిన లబ్ధిదారులు అందరు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చీరాలనగర్ 1, 2 లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను డీఈ పరిశీలించారు. డీఈ వెంట ఏఈ శ్రీనివాసులు, ఆయా పంచాయితీల్లోని సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

సిబ్బంది లక్ష్యాలు సాధిస్తేనే గుర్తింపు

కారంచేడు: వైద్య సిబ్బంది తమకు కేటాయించిన లక్ష్యాలుసాధిచేలా కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జే హస్మప్రియ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలోని గర్భిణులను మూడో నెలలోనే గుర్తించి వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వారి పూర్తి సమాచారం ఎన్‌ఆర్‌హెచ్‌ఎం, అన్‌మోల్ యాప్‌లలో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మీనాకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీలో పీహెచ్‌ఎన్ సువర్ణజ్యోతి వైద్య సిబ్బందికి ఆరోగ్య సలహాలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వసంతవల్లి, హెచ్‌ఎస్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియ

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చేయడంతో పాటుగా ప్రజల ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. మంగళవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ డే సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని అన్నీ గ్రామ పంచాయతీల్లోని ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పీహెచ్‌సీలోని సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే బంగారు భవిష్యత్తు

స్వర్ణ(కారంచేడు): మీ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం స్వర్ణ గ్రామంలో ఉత్తర బజారు, వైసీ కాలనీలలో క్యాంపెయిన్ నిర్వహించారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలలో అందిస్తున్న విద్య, ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ బృందం గ్రామంలోని 5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతిలో చేర్పించే విద్యార్థుల జాబితా తీసుకొని వారి గృహాలకు వెళ్లి మన ఊరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే ఎందుకు చేర్పించాలనే విషయమై తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో భవానీప్రసాద్, మల్లేశ్వరరావు, సుధాకర్, భాస్కర్, ప్రకాశరావు, శివరామప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు